నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మార్చి 21, 2025 | www.navatelangana.com

నేటి నుంచి పది పరీక్షలు

- ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతి : డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. నేటి(శుక్రవారం) నుంచి నిర్వహించనున్న పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం, విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని, కాగా ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష హాల్‌లోకి అనుమతించనున్నట్టు డీఈఓ అశోక్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 22,915 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 22,657 గాను 11,418 మంది బాలురు, 11,239 మంది బాలికలు ఉన్నారు. ప్రయివేట్‌గా రాస్తున్న విద్యార్థులు 258 మంది ఉన్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 141 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అయితే కాంపోజిట్ కోర్సు, సైన్స్ పేపర్ల కు 20 నిమిషాలు అదనపు సమయం ఉన్నట్టు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో చేరండి..

నవతెలంగాణ-బిచ్కుంద



ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కరపత్రాలు పంపిణీ

మండలంలోని దడ్గీ చౌరస్తాలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరాలంటూ ప్రిన్సిపల్ అశోక్ సూచన మేరకు అధ్యాపక బృందం ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు తీసుకొని వాటిని పంచుతూ రండి డిగ్రీ కళాశాలలో చేరండని ప్రచారం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతన అవకాశాలు ఉన్నాయని వివరిస్తూ విద్యార్థులకు సూచనలు సలహాలు ఇస్తూ ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు అడ్మిషన్ పొందడం వలన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులకు వివరించారు.

బార్ధాన్ కార్మికులకు కూలీరేట్‌లు పెంపు

- పోరాటాల ఫలితంగానే : సీఐటీయూ



మాట్లాడుతున్న అధికారులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత 15 రోజులుగా గోనె సంచులు కుట్టే బర్ధాన్ కార్మికులు తమ కూలి రేట్లు పెంచాలని యాజమాన్యాలతో చర్చలు జరిపినప్పటికీ అంగీకారం కుదరక 15 రోజులుగా పనులను మానేసి 250 మందికి పైగా కార్మికులు పోరాటం చేయటం వలన సిఐటియు నాయకుల జోక్యంతో లేబర్ అధికారుల సమక్షంలో సిఐటియు నాయకులు కార్మిక సంఘం యజమానులు లేబర్ అధికారుల సమక్షంలో గురువారం చర్చలు జరిపారు. దీంతో కూలీ రేట్‌లు పెంపుదలకు ఇరువురు అంగీకరించి రెండు సంవత్సరాల వరకు వాటిని అమలు జరపటానికి ఒప్పందం కుదిరింది. అనంతరం కార్మికులతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కార్మికుల పోరాట ఫలితంగా వేతన ఒప్పందంలో విజయం సాధించారని ముఖ్యంగా కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహిస్తే విజయం సాధించటం సులభం అవుతుందని ఇది రుజువు చేసిందని తెలిపారు. జిల్లా లేబర్ అధికారులు కార్మికుల డిమాండ్లను యజమాన్యులకుతో ఒప్పించటానికి సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేయడంతో పాటు భవిష్యత్తులో కార్మికుల సమస్యల పైన సిఐటియు నిరంతరం అండగా ఉంటుందని శ్రమజీవుల పక్షాన ఎర్రజెండా నిలబడుతుందని అని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచుకోవడంలో అసంఘటిత కార్మికులు మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని ఈ వేతన ఒప్పందం కార్మికుల పోరాట విజయమని వారు తెలిపారు. వేతనాలను ఏప్రిల్ ఒకటి నుండి అమలులోకి వస్తాయని వివరించారు. గత ఒప్పందాల కన్నా ఇప్పుడు జరిగిన కూలీ రెట్ల పెంపుదల మెరుగైన ఒప్పందం అని కార్మికులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రాము, ఇమామ్, షేక్ అబ్దుల్, రాజు, విజయ్,కేదార్ అమ్మ, తదితరులతోపాటు యాజమాన్యం తరపున అధ్యక్ష కార్యదర్శులు నరసయ్య,సతీష్ , లేబర్ అధికారులు యోహాన్, రాజేష్ పాల్గొన్నారు.

డైట్ టెండర్ మళ్లీ వాయిదా..?

- పూర్తయినట్టు ఇది వరకే ప్రకటించిన అధికారులు
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు భోజనం పెట్టే టెండర్‌లో అనేక ఆరోపణలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

జీజీహెచ్(ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)లో రోగులకు ఉదయం వేళ పాలు, టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి వేళ భోజనం పెట్టేందుకు నిర్వహణ బాధ్యతలను ఒకరికి అప్పగిస్తుంటారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం పెట్టేందుకు తక్కువ ధరలో ఎవరు కోట్ చేస్తారో వారికి టెండర్ ఇస్తుంటారు. ఏడాది పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తుంటారు. అయితే టెండర్ ఇచ్చే విషయంలో అవకతవకలు జరుగు తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీల్డ్ కవర్‌లో టెండర్‌లు ఆహ్వానించి తక్కువ కోట్ చేసిన వారికి టెండర్ ఇవ్వాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా దాదాపుగా పదేండ్ల నుంచే ఒకే వ్యక్తి టెండర్ దక్కించుకుంటున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని ఇతర టెండర్‌దారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా తాజాగా సైతం మరోసారి పాత వారికే టెండర్ దక్కినట్టు అధికారులు ప్రకటించగా.. మళ్లీ వాయిదా పడినట్టు ప్రకటించడం పలు అనుమానాలకు తావిస్తుంది.

ప్రస్తుతం డైట్ సరఫరా చేస్తున్న టెండర్ దారుడిపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇతరుల పేరుమీద వచ్చిన టెండర్‌ను ను సైతం తానే నిర్వహించేవారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వ్యక్తమ వుతున్నాయి. కాగా ఇటీవల సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రస్తుతం డైట్ సప్లై చేస్తున్న వై. శ్రీనివాస్ డైట్ కాంట్రాక్ట్ నిర్వాహకుడు అయిన జి.గంగాధర్ అనే వ్యక్తికి ఎలాంటి అనుభవం లేదని వై. శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ పొందిన కాంట్రాక్టును గంగాధర్ అనే వ్యక్తి దొంగ దారిలో నిర్వహిస్తున్నారని, దీనిపై అసలు కాంట్రాక్టర్ అయిన వై. శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల సహచట్టం కింద దరఖాస్తు చేయగా.. అందులో సైతం వై.శ్రీనివాస్ పేరిట టెండర్ మంజూరైనట్టు ఉన్నా.. జి. గంగాధర్ అనే వ్యక్తి డైట్ సరఫరా చేస్తూ డబ్బులు సైతం తన ఖాతాలోనే జమ చేసుకుంటున్నట్టు ఆయన ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటీ అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారదర్శకంగా డైట్ టెండర్ నిర్వహించాలని టెండర్ దారులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ బదిలీపై గొడవ

- ఆయాకు ప్రమోషన్ రాకుండా నిలిచిపోయినట్టు స్థానికుల ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని మిర్చికంపౌండ్‌లో గల అంగన్‌వాడీ కేంద్రం-2కు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి అంగన్‌వాడీ టీచర్ జీ లావణ్య బదిలీపై రావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి సెంటర్‌లో 11 ఏండ్లుగా ఆయాగా పని చేస్తున్న అసదీ మీనాకు టీచర్‌గా ప్రమోషన్ కల్పించి.. స్థానికంగా ఉన్న వారికి ఆయాగా కేటాయించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా మెట్‌పల్లి నుంచి టీచర్‌ను బదిలీపై తీసుకురావడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్‌లుగా, ఆయాలుగా పని చేసే వారు స్థానికంగా ఆయా డివిజన్‌లో ఉన్న వారికే కేటాయిస్తారు. కానీ అందుకు విరుద్ధంగా మెట్‌పల్లి నుంచి ఎలా కేటాయించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు.. కలెక్టర్‌ను సైతం మిస్‌గైడ్ చేసి ఇతర ప్రాంతాల నుంచి అంగన్‌వాడీలకు బదిలీపై తీసుకొస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంతేకాకుండా ఆర్జేడి నుండి వచ్చిన లెటర్ లో పూర్తిగా వివరంగా ఉన్నట్లయితే వారికి ప్రమోషన్ బదిలీపై ఇచ్చే అవకాశాలు ఉంటాయి కానీ అందులో ఎటువంటి పూర్తి సమాచారం లేకుండా అసంపూర్తి సమాచారంతో పంపడంతో ఇక్కడ ఉన్న అధికారులు అయోమయానికి గురి అవుతున్నారు. ఇటువంటి సమస్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు. అంతేకాకుండా లావణ్య నివాస ప్రాంతం అడ్రస్‌లో అసలు ఇంటి నంబరు సక్రమంగా లేదని అపవాదాన్ని కూడా కాలనీ వాసులు చెప్తున్నారు.

నేడు అసంఘటితరంగ కార్మికుల చలో హైదరాబాద్

- జయప్రదం చేయండి : సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

మార్చి 21న అసంఘటితరంగ కార్మికుల చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. బీడీ భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, వంటి అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, జీవన భృతి, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాల అమలుకై మార్చి 21న మహాధర్నాను జయప్రదం చేయండి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. ప్రధానంగా భవన నిర్మాణం, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ బీడీ వంటి అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టం తీసుకురావాలని, హమాలీ, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, బీడీ కార్మికులకు జీవన భృతి, కనీస వేతనాల జీఓ విడుదల చేయాలని, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి, బోర్డు నిధులు దుబారా చేయకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ఎండగడుతూ అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాల అమలుకై 2025 మార్చి 21న హైదరాబాద్ ఇందిరపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్పోర్ట్, బీడీ తదితర అసంఘటితరంగ కార్మికులంతా ఐక్యంగా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు, నగర అధ్యక్షులు కృష్ణ, పండరి కిషన్, పాల్గొన్నారు.

పేషంట్‌ల బంధువులు సహకరిస్తే
మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

జిజిహెచ్ సూపరింటెండెంట్ ఫరీదా బేగం

నవతెలంగాణ-కామారెడ్డి

ఆసుపత్రికి వచ్చే పేషెంట్ల బంధువులు సహకరిస్తే పేషెంట్లకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేయనున్నట్టు కామారెడ్డి జిజిహెచ్ సూపరింటెండెంట్ ఫరీదా బేగం అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. విధులకు ఆటంకం కలిగించేలా ఎవరు ప్రయత్నించిన తాము మెరుగైన సేవలను పేషెంట్లకు అందించలేక పోతామని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పేషెంట్ల బంధువులు తాము చెప్పిన విధంగా నడుచుకుంటే రోగులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా తొందరగా వ్యాధులు నయం చేసి ఇంటికి పంపించడం జరుగుతుందన్నారు. జిజిహెచ్‌లో ఫిబ్రవరి నెలలో 200 లకుపైగా నార్మల్ డెలివరీలు చేయడం జరిగిందని, 200 వరకు సిజేరియన్ డెలివరీలు చేసినటుట తెలిపారు. కానీ కొందరు తమ కూతుర్లు నొప్పులు భరించలేరని నార్మల్ డెలివరీ వద్దు.. ఆపరేషన్ చేయాలని కోరుతున్నారని, ఇలా చేయడం వల్ల తల్లీతోపాటు బిడ్డపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు.

ఆపరేషన్ చేసి కుట్లు సరిగా వేయలే

- కామారెడ్డి జీజీహెచ్‌లో పురుగుల మందు డబ్బాతో భార్యభర్తల హల్‌చల్

నవతెలంగాణ-కామారెడ్డి



పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న కానిస్టేబుల్

అడిగిన సమాచారం ఇవ్వడం లేదని భార్యభర్తలు పురుగుల మందు డబ్బాతో గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిజిహెచ్ ఆస్పత్రిలో హల్చల్ చేశారు. కామారెడ్డి జిజి హెచ్ ఆస్పత్రిలో అడిగిన సమాచారం ఇవ్వడం లేదని తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన పులి స్వప్న దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని భార్యాభర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన పులి స్వప్న 2022 సంవత్సరంలో ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ కోసం వచ్చింది. డెలివరీ కోసం ఆపరేషన్ చేసిన వైద్యులు కుట్లు సరిగా వేయకపోవడంతో గత సంవత్సరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో సూరారం వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మళ్ళీ ఆపరేషన్ చేయించుకున్నానని, జిల్లా ఆస్పత్రిలో తనకు ఆపరేషన్ చేసిన వైద్యులు ఎవరో తెలుసుకోవడం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా గత 14 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నామని 14 నెలలుగా పత్రి చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. 20 రోజుల క్రితం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు కదా కలెక్టరే ఇస్తారు అని డాక్టర్ విజయలక్ష్మి దురుసుగా మాట్లాడారని భార్యభర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

గురువారం ఇద్దరు తమకు సమాచారం ఇవ్వకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని డబ్బాతో జిజిహెచ్ హాస్పిటల్‌కు వచ్చారు. అక్కడే ఉన్న ఆసుపత్రి కానిస్టేబుల్ లక్ష్మణ్ రావు వాళ్ల దగ్గరకు వచ్చి వివరాలు కనుక్కోని పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ఏదైనా ఉంటే మాట్లాడుకోవాలని, ఇలా చేయడం సరికాదని సర్దిచెప్పారు. దాంతో భార్యభర్తలు అక్కడినుంచి వెళ్లిపోవడంతో ఆస్పత్రి వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం

- జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కురిసిన వర్షం
- చేతికొచ్చే వేళ.. వరి పంటకు నష్టం



బాల్కొండలో మెరుపులు..

నవతెలంగాణ-విలేకరులబృందం

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపం చూపగా.. సాయంత్రం వేళ.. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెంజల్ మండలంలో సాయంత్రం 7.30 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పాటు పోతంగల్, నవీపేట్, బోధన్, బాల్కొండ తదితర ప్రాంతాల్లో రాత్రి సమయంలో ఈదురుగాలులతో వర్షం కురిసింది.

కాగా వర్షంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందినట్టు పలువురు భావిస్తున్నారు. అయితే పొట్టదశలో ఉన్న వరి పంటకు ఈదురుగాలులతో నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం మొత్తం కొంటాం.. దళారులకు విక్రయించొద్దు

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే, చైర్మన్

నవతెలంగాణ-వర్ని



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఎండ కాలం పంటలకు మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, దళారులకు రైతులు అమ్ముకొని మోస పోవద్దని బాన్స్‌వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. చందూర్, వర్ని మండలాలలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని పిఏసిఎస్ సెంటర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా సంతోషంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ముందస్తుగా కోత కోసిన రైతులు దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అమ్ముకొని కేంద్రాలను స్వాదివియోగం చేసుకోవాలని రైతులకు చూచించారు. రైతులకు ధాన్యం ఏ గ్రేడ్ కు 2320/- బి గ్రేడ్ 2300/- రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని, బోనస్ 500 రూపాయలు క్వింటలకు ఇస్తుందని తెలిపినారు. రైతే రాజుగా ఉండటానికి పచ్చని పంటలు పండించుకొనేలా సాగు నిరు అందించేందుకు నిజాంసాగర్ కెనాల్‌పై లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కూడా పూర్తి అవుతున్నాయని, ఈ లిఫ్ట్ ద్వారా ఆయకట్టు ప్రాంత రైతులు సంతోషంగా మూడు పంటలు పండిస్తారని అన్నారు. మండలాలతో గ్రామీణ రైతులకు, పేద బడుగు ప్రజలకు తాగు, సాగు నీరు మరో దఫా కూడా అందిస్తామని తెలిపారు. చందూర్ సెంటర్ నుంచి లక్ష్మపూర్ గ్రామానికి వెళ్లే రహదారిని వెడల్పు చేస్తామని, అందుకు సంబందించిన నిధులు మంజూరు అయినవి త్వరలో రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందూర్ మండల నాయకులు పిఏసిఎస్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, మేడిపల్లి రవీ, దేవి సింగ్, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, పోతారాజు శ్రీనివాస్, ఏ ఎం సి డైరెక్టర్ సుధాకర్ రావు, హైమద్ , వర్ని మండల నాయకులు మండల అధ్యక్షులు గోపాల్, నెమని విరాజ్, మైనారిటీ అధ్యక్షులు ఎమ్‌డి భారీ, తహసీల్దార్ శాంత కుమారి పాల్గొన్నారు.

పరీక్షలకు బైబై..



పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

- ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు
- చివరి రోజు 438 మంది ఆబ్సెంట్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసాయి. ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారంతో ముగియగా.. ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిసాయి. దీంతో విద్యార్థులు గంతులేశారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఇంటిబాట పట్టారు.

గురువారం రెండవ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. 438 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 15,896 మంది విద్యార్థులకు గాను 15,458 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 97.2 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు.

కాగా ఇన్నిరోజుల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. పరీక్షలు ముగియడంతో ఆనందంతో గంతేశారు. తదుపరి గమ్యాలను వెతుక్కునేందుకు ఇంటి బాట పట్టారు. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ.. ఏయే కోర్సుల్లో చేరాల్లో తోటి స్నేహితులతో చర్చించుకున్నారు.



పరీక్షలు ముగియడంతో హాస్టళ్లను ఖాళీ చేసి ఇండ్లకు వెళ్తున్న విద్యార్థులు

అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

- పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : అధికారులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు

నవతెలంగాణ-జుక్కల్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్ రావు సూచించారు. అన్ని శాఖ అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమైయ్యారు. అభివృద్ధికి సంబంధించి శంకుస్థాపనల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎక్కడైనా ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్యకర్తలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు మంజూరు చేయిస్తున్నానని తెలిపారు. మౌలిక సదుపాయాలతో పాటు, దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించుకుంటున్నామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి సత్తా చాటాలని, ఆ దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకొని పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజలకు ఈ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కామారెడ్డి శాసన సభ్యులతో కలిసి కామారెడ్డి శాసన సభ నియోజక వర్గంలో తాగునీటి సమస్యలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీఓ, డివిజనల్ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. నియోజక వర్గంలో 48 గ్రామాలలో రూ.53.36 లక్షల నిధులు కేటాయిం చడం జరిగిందని తెలిపారు. అట్టి నిధులతో ఆయా గ్రామాలలో పనులు చేపట్టి యుద్ధప్రాతిపది కన పనులు పూర్తిచేసి తాగునీటి సౌకర్యా లు కల్పించాల న్నారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే 5 కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేస్తున్నామని, పాతవి 3 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన పక్షంలో మరో 4 ట్యాంకర్లు కొను గోళ్లు చేపడ తామని సూచించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు వస్తే గ్రామ పంచాయతీ నిధుల నుంచి పనులు చేపట్టాలని, అవసరమైతే ఇతర నిధులు సమకూరు స్తామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ - పోతంగల్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం

మండల కేంద్రంలో గురువారం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి , తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్ రాజ్ ప్రారంభించారు. అనంతరం సహకార సంఘం, పోతంగల్ పి పి సి కేంద్రం ప్రారంభోత్సవం చేశారు. తదుపరి హెగ్డోలి పి పి సి కేంద్రం నందు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పోతంగల్ నందు ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పార్టీ కార్యకర్తలు, అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

నవతెలంగాణ-ముప్కాల్



మండల కేంద్రానికి చెందిన గద్దల చంద్రయ్య క్యాన్సర్ మరియు వాసెక్యులర్ డిసిస్‌తో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు విషయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుకొని వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కొరకు రూ.లక్ష 10 వేల రూపాయల ఎల్వోసీ కాపీని మంజూరు చేయించి సంబంధిత కుటుంబ సభ్యులకు గురువారం హైదరాబాద్ లో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గద్దల సాయిలు, టి.సాయన్న, గద్దల గంగారాం, రాజేందర్, టీంకు తదితరులు పాల్గొన్నారు..

అధ్యాపకులకు వీడ్కోలు, స్వాగతం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘనపూర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల వీడ్కోలు, నూతన అధ్యాపకులకు స్వాగత కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ చంద్రవిట్టల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామక మైన నూతన లెక్చరర్లు ఆర్ శ్రీనివాస్ (కామర్స్), బి రామకృష్ణారెడ్డి భౌతికశాస్త్రంలకు స్వాగతం పలికారు. కళాశాల నుండి వీడ్కోలు పొందిన సి.లక్ష్మణ్ (భౌతికశాస్త్రం), పి నరేష్ (తెలుగు), బి విఠల్ కామర్స్‌కు సన్మాన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రవిఠల్ మాట్లాడుతూ.. వీడ్కోలు పొందిన లెక్చరర్లు కళాశాలలో చేసిన సేవలు మర్చిపోలేనివన్నారు. నూతనంగా కళాశాలకు వచ్చిన అధ్యాపకులకు స్వాగతం తెలుపుతూ కష్టపడి పనిచేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా శాయశక్తుల కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజీ, మురళి, అర్చన, అద్యాపాకులు, బోధినేతన సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్ గ్రామీణ గ్రంథాలయంలో మార్పులు

నవతెలంగాణ-ముప్కాల్



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతండ్డి రాజారెడ్డి వారం రోజుల క్రితం ముప్కాల్ గ్రామీణ గ్రంథాల యంను పరిశీలించారు. పరిశీలన సమయంలో స్థానిక గ్రంథాల యంలో పాఠకులకు సరైన ఫర్నీచర్, చదువుకో వడానికి పుస్తకాలు లేక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రత్యేక చొరవ తీసుకుని గ్రంథాలయానికి అవసరమైన ఫర్నీచర్, పుస్తకా లను సంబంధిత శాఖా గ్రంథాలయం ద్వారా గురువారం ఏర్పాటు చేయిం చారు. దీంతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లో ముప్కాల్ గ్రామీణ గ్రంథాలయం మార్పుకోసం కృషి చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డికి గ్రంథాలయ పాఠ కులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథా లయ నిర్వహకురాలు, పాఠకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

గౌడ సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన గౌడ సంఘం కార్యవర్గం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోమండల నూతన యువజన సంఘము ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల గౌడ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల నూతన అధ్యక్షులుగా నవీన్ గౌడ్ (చౌట్ పల్లి), కోశాధికారిగా ఊట్నూర్ హరీష్ గౌడ్ (ఉప్లూర్), ప్రధాన కార్యదర్శిగా చందు గౌడ్ (నాగపూర్), కార్యదర్శులుగా మధు గౌడ్ (కమ్మర్ పల్లి), జి. భారత్ గౌడ్ (కమ్మర్ పల్లి), ఉపాధ్యక్షులుగా బి. రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా యువజన సంఘ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్యాల సుభాష్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఉత్కమ్ గంగాధర్ గౌడ్, సభ్యులు సదాశివ గౌడ్, కిషన్ గౌడ్, సంజీవ్ గౌడ్, మండల గ్రామ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బుధవారం రాత్రి తాడ్‌బిలోలి వైపు వెళుతున్న అక్రమ ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రెంజల్ ఎస్ఐ ఈ సాయన్న తెలిపారు. బోర్గం గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా టిప్ప ర్‌ను పట్టుకున్నామన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

డియల్‌పిఓ శ్రీనివాస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ క్రమ బద్దీకరణ కోసం ఇచ్చిన గడువు అవకాశాన్ని లాబ్దిదారులు సద్వినియోగించుకోవాలని డిఎల్‌పిఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని నడపల్లి గ్రామ పంచాయతీలో ఎల్ఆర్ఎస్ క్రమ బద్ధికరణ ఫీజును చెల్లించిన లబ్ధిదారులకు రసీదులను అందజేశారు. కార్యక్రమంలో నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి ఇన్చార్జి ఎంపీఓ నిట్టు కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, సంతోష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కదిలించేది కవిత్వం

- **నేడు ప్రపంచ కవిత దినోత్సవం**
- **ఉద్యమాలకు నడిపించింది కవిత్వాలే..**

నవతెలంగాణ-ఆర్మూర్



కవిత్వం కదిలించేది... మనల్ని ముందుకు నడిపించేది... నిద్ర వదిలించేదని అన్నారు శ్రీశ్రీ. సమాజంలో పెను మార్పులు తీసుకువస్తూ కాలంతో ఉద్యమంలో దూసుకుపోతూ సమాజంలో అంధకారాన్ని తొలగించే వెలుగును నింపుతుంది కవిత్వం. నేడు ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా....

కవి చెప్పేదే కవిత్వం విప్పి చెప్పేదే విమర్శ అంటారు పెద్దలు. ఎలాంటి స్థితిలో ఉన్నాం. ఎలాంటి ఇబ్బందులు పడుతున్నామే అన్ని విషయాలపై సమగ్రంగా కాలంతో కవిత్వ రూపంలో రాసి ప్రజల ముందు ఉంచుతారు కవులు. మనిషి తన గురించి తన పరిస్థితుల గురించి ఆలోచింప చేస్తాయి కవిత్వాలు. సగటు మనిషికి బాసటగా నిలుస్తుంది కవిత్వం. ఓదార్పు కావాలన్నా, లాలన కావాలన్నా, పోరాట పటిమను అలవర్చుకోవాలన్న కవిత్వాలు ఎంతో ఉపయోగపడతాయి. కొత్త ఆలోచనలకు కొత్త దిశ నిర్దేశాలకు మార్గదర్శకులుగా ఉంటాయి. కవిత్వాలు సమాజం బాగుపడాలన్న, సమాజాన్ని అంధకారంలో నుంచి విముక్తి చేయాలన్న కవులు రచించిన కవిత్వాలు ఎంతగానో ఉపయోగపడతాయి. కవి నిజాయితీగా ఉండి ప్రజల బాధలకు తన రచనలతో పరిష్కారం చూపగలిగేలా ఉండాలి.

కవి చైతన్య శాలి...

కవి నిత్య చైతన్య శాలి. తాను మేల్కొంటూ ఇతరులను మేల్కొల్ప గలగాలి. సామాజిక రుగ్మతలు తొలగించుకుంటూ కవుల రచనలు ఉంటే సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కవిత్వం అనేది సమాజ హితం కోసమే ఉండాలి. సమాజంలో నెలకొన్న అంధకారాన్ని పారదోల గలగాలి. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది కవులు ఎన్నో రచనలు చేసి సమాజాన్ని మేల్కొల్ప గలిగారు. సమాజంలో చైతన్యం తీసుకురాగలిగారు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కవిత్వాలు ఎంతగానో ఉపయోగపడతాయి. సామాజిక సమస్యలు పరిష్కరించబడతాయి. తెలంగాణ ఉద్యమంలో సైతం కవిత్వంతో ఉద్యమాలు ఉప్పెనెలా ఎగిసి పడ్డాయి. తెలంగాణ ఉద్యమంలో ఎంతోమంది కవులు రచించిన పాటలు, కవితలు సమాజాన్ని ఉద్యమం వైపునకు పరిగెత్తించాయి. తెలంగాణ ఉద్యమ పాటలు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేలా కృషి చేశాయి. పాటలతో పాటు గ్రామంలో ప్రజలు చైతన్యమై ఉద్యమ బాట పట్టారు. నేడు ఉమ్మడి జిల్లాలోని నెలకొన్న సమస్యలపై, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై, దళితులపై వివక్ష, మహిళలపై పెరుగుతున్న దాడులు, గల్ఫ్ బాధితుల కష్టాలపై కవులు తమ కవిత్వాలతో ప్రజలను చైతన్యం పరిచేందుకు కృషి చేయాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు.

కవి ప్రజల పక్షం ఉండాలి



దాక్టర్ అమృత లత, ప్రముఖ రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి, ఆర్మూర్

కవులు నిత్యం ప్రజల పక్షం ఉండాలి. కవిత్వం అనేది ఎంతో విలువై నది. సమాజంలో ఎన్నో రకాల మార్పులు తీసుకురావడానికి కవి త్వం దోహదప డుతుంది. కవులు నిజాయితీగా నిబ ద్ధతతో ప్రచారాలు అందించి సమాజానికి ఉపయోగపడాలి.

ఆరు నెలలుగా జీతాలు రాక

ఇబ్బందుల్లో జీపీ కార్మికులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ పంచాయతీల్లో పనులు చేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని మురళి పేర్కొన్నారు. గురువారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,750 గ్రామ పంచాయతీలో 60 వేల మందికి పైగా పంచాయతీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని వారికి గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీ కార్మికులకు ప్రతి నెల 5వ తారీఖు లోపు జీతాలు ఇస్తామని హామీ ఇచ్చి 18 నెలలు గడుస్తున్న జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

గత పోరాటాల ఫలితంగా జనవరి నెల నుండి కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తారీఖున జీతాలను వారి ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభు త్వం మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు హా మీని అమలు చేయకపోవడం దారుణమని పేర్కొ న్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్ గా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహా 30శాతం పిఆర్‌సి అమలు చేయాలని జీవో నెంబర్ 51 సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. పంచాయతీ కార్మికులకు 16,500 వేతనాన్ని ఇవ్వాలని, జనశ్రీ బీమాను వర్తింప చేయా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్ష ంలో కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందో ళనలు చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న, టి యు సి ఐ జిల్లా నాయకులు కిషన్, ఏపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయ గౌడ్, పంచాయతీ కార్మికులు మహేష్, రాము, సురేష్, బాలు, నరేష్, గంగాధర్, భోజన్న, నరేష్, శ్రీకాంత్, రమేష్, లింగం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకనం కోసం

అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు

- **జిల్లా ఇంటర్ విద్యాధికారి**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2025 మార్చి ఇంటర్ పరీక్షల మూల్యాంకనం సంస్కృతం సబ్జెక్టు ప్రారంభమైందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం తెలియజేశారు. ఈనెల 22 నుండి మొదటి స్పెల్, 24 నుండి రెండవ స్పెల్, 26 నుండి మూడో స్పెల్, 28నుండి నాలుగవ స్పెల్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 22న ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని, 24నుండి ఫిజిక్స్, ఎకనామిక్స్, 26 నుండి కెమిస్ట్రీ, కామర్స్, 28 నుండి హిస్టరీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ, ఇతర గురుకుల కళాశాలలో అధ్యాపకుల విధుల ఆర్డర్ కాపీలను కళాశాల లాగిన్‌లో నిక్షిప్తం చేయడం జరిగిందని తెలియజేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆయా తేదీల వారీగా అధ్యాపకులను రిలీవ్ చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆదేశించారు. నాట్ అపాయింట్ లిస్టులో ఉన్న అధ్యాపకులను కూడా వీధుల్లోకి తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలియజేశారు. 22వ తేదీ నుండి ప్రారంభమవుతున్న సబ్జెక్ట్ మూల్యాంకనంలో పాల్గొనే అధ్యాపకులను శుక్రవారం 21న ప్రిన్సిపాల్స్ రిలీవ్ చేయాలని, 22న అధ్యాపకులు మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆదేశించారు. ప్రైవేట్ యాజమాన్యాలు, కానీ ఇతర ఏ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులను రిలీవ్ చేయనట్టయితే బోర్డు నిబంధనల మేరకు వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

నిఖార్సయినా ఉద్యోగిని కోల్పోయాం : ఎస్పీ రాజేష్ చంద్ర

కుటుంబానికి అండగా ఉంటామని హామీ

అధికార లాంచనాలతో అంత్యక్రియలు

నవతెలంగాణ-గాంధారి





రోజు మాదిరిగా విధులకు సిద్ధమయ్యారు. శాంతిభద్రతలను కాపాడే కొలువు అయిన పోలీసు శాఖలో ఆయన నిఖార్స యినా ఉద్యోగి.. రాత్రి బందోబస్తు కోసం తోటి ఉద్యోగితో కలిసి విధులకు హాజరయ్యారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను కారు ఢీకొట్టింది. దీంతో కానిస్టేబుల్ వడ్ల రవికుమార్(40) అక్కడికక్కడే మృతిచెందగా, మరో కానిస్టేబుల్ సుభాశ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గాంధారి మండల కేంద్రంలో గురువారం తెల్లవారు జాము ఉదయం 3 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. కాగా విషయం తెలుసుకున్న కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం హుటాహుటీన కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మార్చురీలో ఉన్న రవికుమార్ మృతదేహాన్ని చూసి ఆయన చలించిపోయారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నిఖార్సయినా ఉద్యోగిగా రవి కుమార్ కు మంచి పేరు ఉందని ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో మృత్యువాతకు గురికావడం పట్ల ఎస్పీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. దేవునిపల్లిలో అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

160 కెవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

నవతెలంగాణ-ముప్కాల్


నూతనంగా ఎర్పాటు చేసిన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎస్ఎస్-51/100 కెవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ స్థలంలో నూతనంగా 160 కెవీఏ కెపాసిటీ ట్రాన్స్‌ఫా ర్మర్‌ను గురు వారం బిగించినట్లు ముప్కాల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఆర్మూర్ డీఈఈ పి.వి రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఈ రాజేశ్వ ర్ మాట్లాడుతూ... మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సరఫరా విషయంలో పాత స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అందుకుగాను స్థానిక గ్రామస్తులు విద్యుత్ అంతరాయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో పెర్కిట్ ఏడీ శ్రీనివాస్, ముప్కాల్ ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ కాంతారావు, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ పోశెట్టి, లైన్ మెన్ వసంత్ రావు, అసిస్టెంట్ లైన్ మెన్ మోహన్, జూనియర్ లైన్ మెన్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి ముగ్గురు బాధితులకు మొబైల్ ఫోన్ లను గురువారం అందజేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు.**

నవతెలంగాణ-రెంజల్

మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలో 446 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. వీరిలో బాలురు 163, బాలికలు 283, గతంలో మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా ఈ ఏడాది మరో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆదర్శ పాఠశాలలో 166, జిల్లా పరిషత్ పాఠశాల రెంజల్ లో 140, జిల్లా పరిషత్ పాఠశాల నీల లో 140 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- **మండల విద్యాశాఖాధికారులు**


పరీక్షకేంద్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నేటి నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలో 08 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టీఎస్ డబ్ల్యూ ఆర్ఈజీఎస్ బాలికలు ధర్మారం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖిల్లా డిచ్‌పల్లి, తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, విక్టరీ హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్-డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెంట్రాజ్ పల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యానంపల్లిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి తెలిపారు. 08 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 08 మంది డిపార్టుమెంటు ఆఫీసర్‌లు, 71 ఇన్విజిలేటర్స్ లను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు సెంటర్లకు కనీసం అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. మొత్తం విద్యార్థులు 1239 కాగా బాలురు 686, బాలికలు 553 ఉన్నారు. మండలంలో మొత్తం ఉన్నత పాఠశాలలు 30. దినిలో (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు- 14 , కెజిబివి - 01 , టిజిఎంఎస్ -01 , ప్రైవేట్ - 07 , రెసిడెన్షియల్ స్కూల్ లు- 07 ఉన్నట్లు వివరించారు.

ఇందల్ వాయి మండలంలో...

ఇందల్ వాయి మండలంలో 04 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి శ్రీధర్ తెలిపారు. ఇందల్ వాయి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గన్నారం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యెల్లరెడ్డిపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంస్థాన్ సిర్నాపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందల్ వాయిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీనిలో 4 చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ అదికారులు 427 మంది ఇన్విజిలేటర్‌లను ఏర్పాటు చేశారు.మొత్తం విద్యార్థులు 467 కాగా బాలురు 190, బాలికలు 277 ఉన్నారు. పరీక్షల సమయం ముగిసే వరకు జిరాక్స్ సెంటర్లను మూసి వేయడం జరుగుతుందన్నారు. ఆయా సెంటర్లో వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వివరించారు.

23న టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ పరీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత మోడల్ ఎంసెట్ పరీక్షను వీఆర్కె అకాడమీ సహకారంతో నిర్వహించనున్నట్లు టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు, టిఎస్ఎస్ఎఫ్ జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ బోండ్ల అంజల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత మోడల్ ఎంసెట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో రావాలని, ఈ పరీక్ష రాయడం ద్వారా భవిష్యత్తులో జరగనున్న ఇంజనీరింగ్, మెడిసిన్ ఎంట్రన్స్ పైన అవగాహన ఏర్పడుతుందని, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాలను, అభినందన జ్ఞాపికలను అందజేస్తామని తెలిపారు. ఈ ఎంట్రన్స్ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు డాక్టర్ బాలు 9492874006, దత్తాద్రి 94408 62825, నవీన్ 9133676076 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

చర్మవ్యాధులపై ఆశాల సర్వే



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలోని 18 గ్రామాలలో గురువారం ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరుగుతూ చర్మం పై కొత్తగా ఏర్పడిన మచ్చలు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి యేమిమా మాట్లాడుతూ అనుమానాస్పద కుష్టు వ్యాధిగ్రస్తులను, ఇతర చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి చికిత్స చేయనున్నట్టు తెలిపారు. 15 రోజులలో మండలంలో పూర్తి సర్వే ఆశా కార్యకర్తలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చర్మగాదిగ్రస్తులు, ఇతర ఇబ్బందులు పడుతున్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి దివ్య, హెచ్ ఈ ఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది సతీష్, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పాల్వంచ వద్ద ఒక లారీని, ఒక ట్రాక్టర్‌ను, వాడి గ్రామం వద్ద ఇంకొక ట్రాక్టర్ ను, బండరామేశ్వర్ పల్లి వాగు వద్ద పట్టుకొని మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యను తీసుకోనున్నట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే 100 కి కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.

బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర వార్షిక బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందనీ 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 3.74 శాతం అంటే రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ సంవత్సరం బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. ఇప్పటికే బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు 6000 కోట్లు పెండింగులో ఉన్నాయనీ, బీసీ గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేవు, వసతులు అసౌకర్యంగా ఉన్నాయి. ఉమ్మడి నిజామబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీకి 100 కోట్లు కేటాయించాల్సింది పోయి కేవలం 35 కోట్లు మాత్రమే కేటాయించి యూనివర్సిటీ అభివృద్ధిని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీసీలకు బడ్జెట్‌ను 40 వేల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గురుకుల విద్యాలయం జూనియర్ కళాశాలకు చెందిన 7గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్‌లో ప్రతిభను చూపారని ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్, పీఈటీ జాదవ్ గణేశ్‌లు తెలిపారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్, కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.యం జైపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి డా కే.పి.అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను కామారెడ్డిలోని ఇందిరాగాంధీ క్రీడాస్టేడియంలో నిర్వహించారు. మద్నూర్ తెలంగాణ గురుకుల విద్యాలయము జూనియర్ కళాశాలకు చెందిన 400మీ పరుగుపందెంలో గోలి.జగదీశ్ (ప్రథమ), టి.జవహర్ సింగ్ (ద్వితీయ), పి.విష్ణు(తృతీయ), 100మీ పరుగుపందెంలో యం.గణేశ్ (ప్రథమ), బి.బాలకృష్ణ(ద్వితీయ), జావిలింగ్ త్రో పోటీలో సి.హెచ్ విష్ణు(ద్వితీయ), బి.రామకృష్ణ(తృతీయ)లు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లలో ప్రతిభను చూపారని తెలిపారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు..

400మీ పరుగుపందెంలో జి.జగదీశ్ (8వ తరగతి), 100మీ పరుగుపందెంలో యం గణేశ్(9వ తరగతి)లు రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు తెలియజేశారు. సహాయ ప్రిన్సిపాల్ సుమన్, విద్యార్థులు రక్షకుడు సంతోష్, పద్యకవి బి.వెంకట్, ఉపాధ్యాయులు-నరహరిప్రసాద్, వేణుగోపాల్, రాము, ఏ.సంజు, నాగయ్య, జే.సంజీవ్, సమీనా, అనూష, శివకళ, తదితరులు విద్యార్థులను అభినందించారు.

బీసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు, విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కృషి చేస్తున్నారని మాజీ జడ్పిటిసి తిరుమల గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారామ్ మధు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అబ్రబోయిన రాజేందర్, మాజీ ఎంపిటిసి నల్లపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామస్వామి గౌడ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు భూపాల్ విజయానంద్, రమేశ్ బత్తిని సిద్ధ రాములు, నయీం, రాజశేఖర్, మర్రి శేఖర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం వాయిదా

నవతెలంగాణ-రాజంపేట్

జిల్లా కలెక్టర్, రాష్ట్ర సలహాదారు గౌరవ షబ్బీర్ అలీ సమావేశం ఉన్నందువల్ల రాజంపేట్ తైబజార్ వేలం వాయిదా వేసినట్టు గ్రామ ప్రత్యేకాధికారి కె. రఘురాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి మొండిచేయి

- ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి కేటాయించినటువంటి నిధులులో మొండిచేయి చూపిందని డీఎస్పీ జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పేద ప్రజలకు కావలసిన అతి ముఖ్యమైన విద్యా, వైద్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ విద్యకు 7 శాతం నిధులు, వైద్యానికి 5 శాతం నిధులు, కేటాయించడాన్ని చూస్తుంటే పేద ప్రజల విద్యకి, ఆరోగ్యానికి వ్యతిరేకమని మరొకసారి తేలిపోయిందన్నారు.

ఇప్పుడు కేటాయించినటువంటి నిధులు విద్యా, వైద్యంలో అభివృద్ధికి సరిపోవని, జీతాలకి, మెయింటెనెన్స్‌కు మాత్రమే సరిపోతాయని అన్నారు. ఇక్కడ అభివృద్ధి ఆ నిధులతో ఎలా చేస్తారు. ప్రభుత్వం విద్య పట్ల, వైద్యం పట్ల కనీసం బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందన్నారు. కేవలం కార్పొరేట్ శక్తుల కోసం మాత్రమే పనిచేస్తుందన్నారు. విద్య వైద్యాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి మాత్రమే పనిచేస్తుందని మండిపడ్డారు. ధర్మసమాజ్ పార్టీ విద్య, వైద్యానికి కనీసం 50 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, కో కన్వీనర్ లు అరవింద్, రాజు, పర్శరాములు, సాయి, కవిన్, రాజలింగం, లక్ష్మణ్, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం

- ఎంఈవో దేవీసింగ్

నవతెలంగాణ-విలేఖరుల బృందం

పిట్లం : నేటి నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాధికారి దేవి సింగ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ మీడియం) పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. 3 పరీక్ష కేంద్రాలలో 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణకు గాను శ్రీరామ్, రామాంజనేయులు, గంగాధర్ లను చీఫ్ సూపర్ డెంటల్‌గా వ్యవహరించగా డిపార్మెంటల్ మెంటల్ ఆఫీసర్ లుగా భోజేందర్, చంద్రకాంత్, యాదయ్య నియమించినట్టు తెలిపారు. కాగా ఒక్కొక్క సెంటర్‌కు 10 మంది చొప్పున ఇన్విజిలేటర్స్‌గా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో పరీక్ష ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసేలా చూడాలని విద్యాధికారి దేవి సింగ్ పరీక్షల సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి : నేటి నుండి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి గురువారం తెలిపారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన 447 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతారని, జడ్పిహెచ్ఎస్ తాడ్వాయి పాఠశాలలో 161 మంది విద్యార్థులు బాలికల గురుకుల పాఠశాలలో 150 మంది విద్యార్థులను జడ్పిహెచ్ఎస్ కంకల్ 136 మంది విద్యార్థులు హాజరవుతారని విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రం ఆవరణలో 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



పిట్లం: మాట్లాడుతున్న ఎంఈవో దేవీసింగ్



నిజాంసాగర్‌లో...

భిక్కనూర్ : నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి, వైద్య, పరీక్షా సమయంలో డెస్కులను ఏర్పాటు చేయాలని టీజీవీపి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్ ఎంఈఓ రాజా గంగారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థులు అసౌకర్యాలకు గురికాకుండా, మాస్ కాపీయింగ్ పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ సమీర్ ఖాన్, యోగేష్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : నేటి నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు మండల విద్యాధికారి యూసఫ్ తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్ర సెంటర్లు ఏర్పాటు చేశారు. సదానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు మోడల్ స్కూల్లో 280 విద్యార్థులు, అడ్లూర్ ఎల్లారెడ్డి సెంటర్లో 160 కల్వరాల్ సెంటర్ లో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఉదయం 9:30 నుండి 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉన్నట్లు తెలిపారు. జిరాక్స్ సెంటర్లు 8:30 నుండి 1 వరకు మూసి ఉంచాలని తెలిపినట్టు తెలిపారు. పరీక్షలు మార్చి 21 నుండి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పరీక్షలు ఉంటాయన అన్నారు.

నిజాంసాగర్ : నేటినుంచి ప్రారంభం అయ్యే పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యా శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ మండల కేంద్రంలో గవర్నమెంట్ హై స్కూల్, ఆదర్శ పాఠశాలలో మొత్తంగా రెండు పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోని ప్రతి క్లాస్ రూమ్ నందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని సీసీ కెమెరా సమక్షంలోనే పరీక్ష నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యను తగ్గట్టు డెస్కులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు ఉదయం 8.30 వరకు వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 9.00 గంటల నుంచి లోపలికి అనుమతి ఇస్తారు. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. 9.35 గంటల తర్వాత ఎవరిని పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉంటుంది కావున విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో భయాన్ని వదిలి పరీక్షలు రాయాలని ఆయన తెలిపారు.

మద్నూర్ : కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలో శుక్రవారం నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, టీఎస్ బాలుర గురుకుల పాఠశాలలో పరీక్ష సెంటర్లు కొనసాగనున్నాయి. మొత్తం 580 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వారిలో బాలుర సంఖ్య 329 మంది, బాలికల సంఖ్య 251 తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-మద్నూర్



ప్రచారం చేస్తున్న డిగ్రీ కాలేజీ ఉపాధ్యాయులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మద్నూర్ ప్రిన్సిపల్ కె.అశోక్ సూచన మేరకు కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా అధ్యాపక బృందం ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద అడ్మిషన్ల కొరకై విస్తృత ప్రచారం గురువారం నిర్వహించారు. రండి. మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి. అంటూ పరీక్ష కేంద్రాల వద్ద ప్రచార కరపత్రాలతో ప్రచారం చేశారు. మద్నూర్ కేంద్రం వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కళాశాలలోని గ్రూపుల వివరాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతన అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులకు వివరించారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-పిట్లం



కుట్టు మిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కుట్టు మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మహిళా మండలి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న 15 మంది అర్హులైన మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్, సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళల అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈడీ దయానంద్, ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్, ఏఎంసీ వైస్ చైర్మన్ మా రెడ్డి కృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, జంబిగే హన్మాండ్లు, వీర్ సంగప్ప దేశాయి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఎల్లారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లాలు నిర్మాణం పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత లోపించకుండా ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు నిర్మించుకోవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. అదేవిధంగా మండలంలోని బోనాల్ బోయిన్పల్లి బాణాపూర్ కోర్పోల్ గ్రామాలలో ఎంపీ ఓ మలహరి వర్మి కంపోస్ట్ నర్సరీలు గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. రికార్డులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రికార్డులు సక్రమంగా ఉండాలని ఆయన సూచించారు. రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా నర్సరీలో మొక్కలు వాడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన కార్యదర్శి యాసుబ్, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేడు సింగిల్ విండో 56వ మహాజనసభ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సింగిల్ విండో 56వ మహాజనసభ ఈనెల 21న ఉదయం 10:30 గంటలకు విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన సంఘ భవనంలో నిర్వహించనున్నట్టు విండో కార్యదర్శి జె.బాబు పటేల్ గురువారం విలేకరులకు తెలిపారు. ఇట్టి మహాజనసభలో 1-10-2024 నుంచి 21-3-2025 వరకు జమ ఖర్చుల ఆమోదించడం గురించి అంచనా బడ్జెట్ 2025-26 అదేవిధంగా ఇతర అంశంలో అధ్యక్షుల వారి అనుమతితో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి మహాచరణ సభ విజయవంతం కావడానికి సంఘం కార్యవర్గ సభ్యులు సంఘం పరిధిలోని రైతులు సకాలంలో హాజరుకావాలని కార్యదర్శి ఒక ప్రకటన ద్వారా కోరారు.

వ్యక్తి అదృశ్యం



సాయిలు (ఫైల్)

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన జనగామ సాయిలు అనే వ్యక్తి కనిపించడం లేదని ఆయన భార్య మంజుల ఈనెల 5న బిబిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. సాయిలు మేస్త్రి పనిచేసేవాడని, ఈ నెల 3న సుమారు మధ్యాహ్నం ఒంటిగంటకు ఇతరులతో ఫోన్ మాట్లాడుతున్నాడని, అతని భార్య మంజూలకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంట్లో నిందిస్తుందని తెలుపగా, తన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం తాము వెతకగా అదే గ్రామానికి చెందిన దండగలరాములకు కామారెడ్డిలో కనిపించాడని తెలిపినట్టు ఆమె తెలిపారని పేర్కొన్నారు. అనంతరం వారి బంధువుల ఇండ్లలో, గ్రామాలలో ఆచూకీ కోసం చూడగా ఎక్కడ ఆచూకీ లభించలేదని దాంతో బీబీపేట పోలీస్ స్టేషన్లో ఆయన భార్య మంజుల ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మహిళా మండల సమైక్య కార్యాలయంలో గురువారం మానవ అభివృద్ధి విభాగం తరపున మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమాలు వంటి అంశాలపై వివోలకు ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఏపిఎం రామ్ నారాయణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ.. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్లో వచ్చే ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని, ఎలాంటి లింకుల పైన కూడా క్లిక్ చేయకూడదని సూచించారు. మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం సంబంధిత అంశాలపై అవగాహన కల్పించాడు. గ్రామాలలో సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిని రాజేశ్వరి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో యువతకు ఉపాధి

నవతెలంగాణ-భిక్కనూర్

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువకులకు ఉపాధి అవకాశం లభిస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలో తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నిరుద్యోగ యువకులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకొని ఉపాధి అవకాశాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, లింబాద్రి, మైపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి బుధవారం రాత్రి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదిగల, మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఎన్నో పోరాటాల ఫలితమే నేడు అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు తాంద్ర మల్లేష్, ఉపాధ్యక్షులు పల్లె స్వామి, ప్రధాన కార్యదర్శి గిరి సాయిలు, యూత్ అధ్యక్షులు చిన్నవారి లింగం, సురేందర్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బీసీ బిల్లు పట్ల హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఆమోదించడం ఆశించదగ్గ విషయమని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద, అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి, మాదిగ కీసరి సంఘం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ ముఖ్య మంత్రిరేవంత్ రెడ్డిల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ముద్రమోహన్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, షౌకత్ పార్టీ ఉపాధ్యక్షులు గైని శివాజీ, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈనెల మూడో తారీఖున ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు గురువారంతో ముగిసిపోయాయి. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం కెమిస్ట్రీ 190 మంది విద్యార్థుల గానం 188 విద్యార్థులు హాజరయ్యారన్నారు. కామర్స్ 37 మంది విద్యార్థులకు 37 మంది హాజరయ్యారని పరీక్షల సూపరిండెంట్ దుర్గయ్య తెలిపారు. చివరి రోజు పరీక్షలకు ఇద్దరు గైరాజరయ్యారన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
శుక్రవారం | మార్చి 21, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబాలను పరామర్శించిన జిల్లా వైద్యాధికారిణి


కుటుంబాని పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారిణి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ నాయుడు అశోక్ సతీమణి సువర్ణాదేవి ఇటీవలే మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ (డిఎంహెచ్ఓ) గురువారం పరామర్శించి ప్రగడసానుభూతిని తెలిపారు. అలాగే అనారోగ్యంతో మరణించిన కుండ శారద (ఎంపీహెచ్ఏ) కుటుంబాన్ని పరామర్శించారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసునని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 17న నిజామాబాద్ నుంచి ధర్మాబాద్‌కు ఆటోలో నూకలు తీసుకు వెళుతున్న ఎస్కే రఫీక్ అనే వ్యక్తిని కందకుర్తి చెక్ పోస్ట్ వద్ద తాను టాస్క్ ఫోర్స్ పోలీసునని చెప్పి బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్టు ఎస్సై సాయన్న తెలిపారు. కందకుర్తి గ్రామానికి చెందిన టి. సతీష్ మూడు సంవత్సరాలుగా చట్టం ఛానల్లో పని చేస్తున్నాడని అన్నారు. తాను టాస్క్ ఫోర్స్ పోలీసునని చెప్పి ఆటో వ్యక్తిని బెదిరించడంతోపాటు మూడు వేల రూపాయలను ఫోన్ పే ద్వారా తీసుకోవడంతోపాటు ప్రతి నెల ఐదువేల రూపాయలు మామూలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సతీష్ ను అదుపులోకి తీసుకొని కోర్టు రిమాండ్ కు తరలించామని ఆయన పేర్కొన్నారు.

టీజీవోస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


టీజీవోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మహమ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు విధి నిర్వహణలో సమర్దవంతంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ పథకాలు ప్రజల్లో తీసుకువెళ్లి అర్హులకు పథకాలు చేరే లా కృషి చేయాలని సూచించారు. టీజీవో సంబంధించిన చాలా సమస్యలు గత ప్రభుత్వంలో పెం డింగ్ లోఉన్నాయి ఆర్థికపరమైన బిల్లులు ఇప్పటి వరకే కొన్ని పరిష్కారం చేశాం. మిగిలిన సమస్యలు కూడా విడతల వారీగా పరిష్కరిస్తాం అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపల్ సూర్యనారాయణ, జిల్లా కలెక్టర్ హనుమంతు, నుడా చైర్మన్ కేశవేణు, టీజీవో రాష్ట్ర కార్యవర్గం సభ్యులు అలుక కిషన్, అమృత్ కుమార్, జిల్లా కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోర్డులే అడ్డంగా మారాయా..?

వాహనాలు కాదా..


బోర్డును తీసుకెస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో షాపులకు సంబంధించిన బోర్డులు రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయని ట్రాఫిక్ పోలీస్ శాఖ వారు బోర్డులను ట్రాఫిక్ వాహనంలో తీసుకెళ్తున్నారు. రోడ్డుకు బోర్డుల అడ్డంగా ఉన్నాయని బోర్డులను తీసుకెళ్తున్నారు కాని.... రోడ్డుపైన వాహనాలను పార్కింగ్ చేస్తే పరిస్థితి ఏంటని అక్కడ ఉన్న వ్యాపార సముదాయాల యజమానులు వ్యాపారస్తులు అంటున్నారు. నగరంలో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రి ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా, రోడ్డుపైన ట్రాఫిక్ అంతరాలు ఏర్పడకుండా ఉండేందుకు వాహనాలు కూడా రోడ్డుపై పార్కింగ్ నిలవకుండా ట్రాఫిక్ సిబ్బంది చూడాలని దుకాణదారులు కోరుతున్నారు.

గ్రంథాలయ పనులను పరిశీలించిన జిల్లా చైర్మన్

నవతెలంగాణ-భీంగల్ రూరల్


మాట్లాడుతున్న జిల్లా చైర్మన్

నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంత రెడ్డి రాజారెడ్డి గురువారం జిల్లాలోని భీమ్‌గల్ పట్టణంలో 28 లక్షలతో నూతనంగా నిర్మించిన శాఖ గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఈనెల 4న చైర్మన్ అంత రెడ్డి రాజారెడ్డి ఈ గ్రంథాలయ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఈనెల చివరిలోగా స్థానిక గ్రంథాలయ పాఠకులకు భవనం అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చైర్మన్ ఆదేశాల ప్రకారం ఇదే నెలలో భవన నిర్మాణం, గ్రంథాలయ గదులను పూర్తి చేశారు. గ్రంథాలయంలో నిర్వహించే విభాగాల గదులను పరిశీలించి భవనం గ్రంథాలయ నిర్వహణకు అనుకూలంగా నిర్మించినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మాజీ వార్డ్ మెంబర్ తోట సతీష్, డప్పు ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెర్కిట్‌లో గురువారం కోరమండల్ ప్రైవేట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సికింద్రాబాద్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది గడ్డం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..పేద విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించాలని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసిన గడ్డం మహేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ జోనల్ మేనేజర్ మనోజ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్వీన్ సుల్తానా, పిఆర్‌టియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పెంట జలంధర్, గడ్డం నారాయణరెడ్డి, మట్ట శ్రీనివాస్ ,తాజా మాజీ కౌన్సిలర్లు, వీడిసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి అమృత్ 2.0 పనుల ప్రగతిపై సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు వీలుగా ఆయా పథకాల కింద నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు లతో కలిసి అమృత్ 2.0 పథకం పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. సుమారు 400 కోట్ల రూపాయల విలువ గల పనులకు గత జనవరి నెలలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి షబ్బీర్ అలీ ఇతర ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఆ పనులు ఏ దశలో కొనసాగుతున్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు అంకితభా వంతో కృషి చేయాలని హితవు పలికారు. ముఖ్యంగా ప్రస్తుత వేసవి సీజన్లో నగరం లో ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపా లన్నారు. రోడ్లు, ఇతర పెండింగ్ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నా మని తెలిపారు. సుదీర్ఘ కాలం నుండి పెండింగ్ లో ఉన్న నిజామాబాద్ మాస్టర్ ప్లాన్ గురించి కూ డా ఉన్నతాధికారులతో ఇటీవలే చర్చించామని అన్నారు. మాస్టర్ ప్లాన్ అమలు జరిగితే నిజామాబాద్ నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా అధికారులు ప్రజోపయోగ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే నిజాంబాద్ నగరపాలక సంస్థ పనితీరు కలెక్టర్ పర్యవేక్షణలో ఎంతో బాగుందని షబ్బీర్ అలీ ప్రశంసించారు ప్రస్తుత రంజాన్ మాసంలో ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా శానిటేషన్ పండ్లను జరిపిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్ అండ్‌బి, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

అనంతరం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ సౌత్, నార్త్ మండలాల లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 565 మందికి రూ. 5.65 కోట్ల పైచిలుకు విలువ చేసే చెక్కులను అందజేశారు.

రక్తదానం, రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్ /మాక్లూర్


ఆర్మూర్: రక్తదానం చేస్తున్న యువకులు


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో , నాగ లింగేశ్వర ఆలయంలో పూజలు చేసి రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అవినీతి మచ్చ లేకుండా ఉండటం పట్టణానికి కి గర్వకారణం అని, రాబోయే కాలంలో మరింత ఉన్నత పదవులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పాలేపు రాజు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజరీ కమిటీ మెంబర్ గుగులోత్ తిరుపతి నాయక్, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, నూతల శ్రీనివాస్, పెద్దోళ్ల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ


ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆలూర్ మండల కేంద్రంలోని కండెరాయుడు మల్లన్న దేవాలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. పేదలకు, రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సూరి శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు గిరీశ్, యువ మోర్చా అధ్యక్షుడు ప్రళయ్ తేజ్, డాక్టర్ అరుణ్, మల్లయ్య, మనీష్, నాగేష్, ప్రణయ్ తేజ్, నవీన్, హరీష్, రాజేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మాక్లూర్: నిజామాబాద్ మున్సిపల్ రెండవ డివిజన్ బోర్గ (కే) గ్రామంలో డా. మట్ట చరణ్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం గురువారం నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి, విద్యార్థులకు పండ్ల పంపిణీ, రక్తదానం చేశారు. దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామి మందిరంలో అర్చన ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, ఉన్నత పదవులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంపురం శ్రీనాథ్, ప్రశాంత్, నవీన్, శ్రీకాంత్, రమేష్, రవి, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఏర్గట్ల


ఏర్గట్ల: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తెలంగాణ శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట రవి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా విద్య, వైద్య, ఉద్యోగ పరంగా 42 శాతం రిజర్వేషన్స్ కల్పించే బీసీ రిజర్వేషన్ల బిల్లు తీసుకొచ్చిన విధంగానే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ బిల్లును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో ఆమోదింప చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ప్రవేశ పెట్టిన జరిగింద న్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలకు వెన్నుదండగ ఉంటు ందనే విషయం బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుతో రుజువైం దన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ రాజేంద్ర ప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డబోయిన నరేందర్ ము దిరాజ్, నాయకులు వేముల గంగారెడ్డి, తెడ్డు రమేష్, దూలూరి కిషన్ గౌడ్, సుంకేట శ్రీనివాస్, పూజారి శేఖర్, తక్కురి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ ఉప వర్గీకరణ బిల్లులు శాసనసభలో ఆమోదంపొందడం, అదే విధంగా తెలంగాణ యువత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రారంభించడంతో ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు మండలకే ంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, జ్యోతిరావ్ పూలే, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీ రవి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెండ్ రేండ్ల రమేష్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, మండల మైనార్టీ అధ్యక్షులు మునీరోద్దీన్, నాయకులు రేండ్ల రాజారెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.13.30 లక్షలకు నడ్పల్లి తైబజార్ వేలం

- దక్కించుకున్న మోహమ్మద్ జావిద్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వేలంలో పాల్గొన్న పాటదారులు

డిచ్ పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిజామాబాద్ డి ఎల్ పిఓ శ్రీనివాస్, మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి నిట్టు కిషన్ రావు అధ్యక్షత పంచాయతీ కార్యాలయ ఆవరణలో తై బజార్ కు బహిరంగ వేలం నిర్వహించారు. వేలం విధానాలను డి ఎల్ పిఓ శ్రీనివాస్ , గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు వివరించి వేలంపాట ప్రారంభించారు. నాలుగురు 50 వేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 13 లక్షలా 11 వేలకు మోపాల్ మండలంలోని కులాస్ పూరు చెందిన మోహమ్మద్ జావిద్ దక్కించుకున్నారు. ఈసారి నలుగురు పాల్గొనగా గతేడాది కంటే ఈసారి 19 వేల రూపాయలకు ఎక్కువ పాడి కులాస్పూర్ గ్రామానికి చెందిన మోహమ్మద్ జావిద్ 13లక్షల 30వేలకు దక్కించుకున్నారు. వారాంతపు సంతలో వసూలు చేసే వాటికిగాను ఈసారి ధరలను గ్రామ పంచాయతీ అధికారులు అందజేశారు. ఈ తైబజార్ వేలం ను మంగళవారం నిర్వహించిన టార్గెట్ రాకపోవడంతో బుధవారంకు వాయిదా వేశారు. రేండు రోజుల్లో సైతం 13 లక్షల వరకు రావడంతో చేసేదేమీ లేక మరోసారి వాయిదా వేశారు. మూడవసారి గురువారం తై బజార్ వేలం నిర్వహించగా13లక్షల 30 వేలకు వేలం పలుకగా జావిద్ కు ఏడాది పాటు తైబాజర్ నిర్వహించుకోవడానికి అనుమతి పత్రం ను అందజేశారు. గ్రామ పంచాయతీ నిర్ణయించిన ఈ ధరల ప్రకారం రోజు వారిగా వారాంతపు సంతలో తైబజార్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ నియమా నిబంధనల ప్రకారం వసూలు చేయాలని సూచించారు. ఈ నెల 31లోపు ధరల బోర్డులను ఏర్పాటు చేస్తామని, మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించాలని పూనుకున్నమని వారు వివరించారు. వారాంతపు సంతలో దొంగల సందడి ఎక్కువగా ఉంటుందని, పలువురి వద్ద నుండి సెల్ ఫోన్లు, డబ్బులు మాయం అవుతుండటంతో దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు కు కృషి చేస్తామని కార్యదర్శి ఎంపిఓ నిట్టు కిషన్ రావు అన్నారు.తైబజార్ ను దక్కించుకున్న మోహమ్మద్ జావిద్ ముందస్తుగా పావల వంతు డబ్బులను చెల్లించాలని అదికారులు గడువు విధించారు. ఇదే కాకుండా తొమ్మిది చెక్కులు ఇవ్వాలని సూచించారు. అధికంగా వసూలు చేస్తే వేలం రద్దు పర్చడం జరుగుతుందని వారన్నారు. సమావేశంలో జూనియర్ అసిస్టెంట్ రజత్ కుమార్, బిల్ కలెక్టర్ సంతోష్, రాము, కంప్యూటర్ ఆపరేటర్ శ్యాంసన్, బాబా, పాల్గొన్నారు.

మర్రి చెట్టుకు మంటలు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూరు గ్రామ శివారులో ఆర్అండ్‌బి రోడ్డు పక్కనే ఉన్న మర్రి చెట్టుకు గురువారం మధ్యాహ్నం మంటలు అంటుకున్నాయి. అధిక ఉష్ణోగ్రత మూలంగా దశాబ్దాల వయస్సు గల మర్రిచెట్టు మంటలు చెలరేగినట్టు ప్రచారం జరుగుతుంది. చెట్టు చాలా వరకు కాలి పోయింది. ఈ దారి గుండా వెళ్తున్న వాహనదారులు గమనించి గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి నర్సయ్య సిబ్బందితో పంచాయతీ ట్యాంకర్ తో నీటిని తీసుకువెళ్లి మంటలను ఆర్పిం చారు.

పది విద్యార్థులకు ఆల్‌దబెస్ట్

నవతెలంగాణ-ఆర్మూర్

నేటి నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ తరఫున ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ.. తెలంగాణలోని ప్రతి రోటరీ క్లబ్ పదవ తరగతి విద్యార్థులకు 100 నుండి 150 పరీక్ష అట్టలను వితరణ చేస్తున్నామని, ఈ సంవత్సరం సుమారు 7000 పరీక్ష అట్టలు వితరణ చేసినట్టు తెలిపారు. అంక్సాపూర్, పిప్రి, చేపూర్, కేశ్‌పల్లి గ్రామాల పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రధాన కార్యదర్శి రాస ఆనంద్ సహాయార్థం సుమారు 150 పరీక్ష ప్యాడ్లు, పరీక్ష సామాగ్రి వితరణ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఫీజులో 25శాతం రాయితీ పొందవచ్చు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్‌ల యజమానులకు ఫీజు చెల్లింపులో 25శాతం తగ్గింపును రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీఓ శివ చరణ్ గురువారం తెలిపారు. మార్చ్ 31 లోపు ప్రజలకు అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించి రాయితీ పొందవచ్చని పేర్కొన్నారు.

4న ధర్పల్లి సంతల వేలం

నవతెలంగాణ -ధర్పల్లి

మండల కేంద్రంలోని వారాంతపు సంత రోజువారీ సంతను ఈనెల 24న సోమవారం నిర్వహించనున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీను తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను మండల పంచాయతీ అధికారి సమక్షంలో నిర్వహించనున్నామని, వేలంలో పాల్గొనే వారు ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండించండి

- అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. ప్రభాకర్

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండించాలని, ఎంఎస్‌పి చట్టంను చేసి అమలు చేయాలనీ, అఖిలభారత ఐక్యరైతుసంఘ (ఏఐయుకేఎస్.) రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి. ప్రభాకర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల అణచివేతను-దాడులను ఖండించాలని అన్నారు. గురువారం పట్టణంలో కుమార్ నారాయణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంజాబ్, యాపి ప్రభుత్వం కేంద్రం మెప్పు కోసం తమ సమస్యలపై పోరాడుతున్న రైతులపై, రైతు ఉద్యమంపై అనాగరిక దాడిని, పాశవిక దాడులను అఖిలభారత ఐక్యరైతు సంఘం(ఏఐయూకేఎస్) తీవ్రంగా ఖండించింది. ఇది మొత్తం రైతాంగ పోరాటాల్లో అత్యంత దుర్మార్గమైందని అన్నారు. పంజాబ్ మంత్రులు హాజరై కేంద్ర ప్రభుత్వంతో చర్చించిన తరువాత పోరాడుతున్న రైతులు నాయకులు తిరిగి వస్తున్నప్పుడు, రైతు నాయకుడు డాలెవాల్ సహా వారిని అరెస్టు చేశారన్నారు. పోలీసులు సంబు, ఖానారి శిబిరాలను నాశనం చేశారని, ఇక్కడ రైతులు ప్రజలు ఫిబ్రవరి 13 నుండి 2024 నుండి ఎంఎస్‌పి డిమాండ్ల రుణాల రద్దుపై ప్రదర్శనలో ఉన్నారన్నారు. రైతాంగంపై పోలీస్ ల దాడి చూస్తే బీజేపీ, అప్ బహిరంగ మిత్రుత్వం తెలియజేస్తుందని అన్నారు. ప్రభుత్వ ఈ స్థాయిలో. సిగ్గులేకుండా నిస్సందేహంగా డాలెవాల్ సహా అరెస్టు చేసిన వారందరినీ తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవారం, రాజన్న అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) జిల్లా నాయకులు ఆర్. దామోదర్, యూ. రాజన్న, టీ. గంగాధర్, ఇ. రమేష్, జి. కిషన్, రైతు జేఏసీ నాయకులు మోతే. భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

డిస్టిక్ సర్వీసెస్ అథారిటీ మెంబర్‌గా డాక్టర్ కవిత రెడ్డి



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ కవిత రెడ్డిని డిస్ట్రిక్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటి మెంబర్‌గా ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ఉత్తర్వుల కాపీని గురువారం జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల చేతుల మీదుగా అందుకున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు, లారీ పట్టివేత

నవతెలంగాణ-దోమకొండ

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ఇసుక లారీ, రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. పాల్వంచ మండల కేంద్రంలో ఒక ఇసుక లారీని, వాడి గ్రామంలో ఒక ఇసుక ట్రాక్టర్, బండరామేశ్వర్ పల్లి గ్రామంలోని వాగు నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్ల పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

అంకెల గారడీ బడ్జెట్



- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీలకు అంకెల గారడీ గానే ఉన్నదని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ అన్నారు. గురువారం కెవిపిఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ అమలు కేటాయింపులు ఏమాయేనని ప్రశ్నించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3,04,965కోట్లతో రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ అంకెలు పెంచు తప్ప ఖర్చులు పెంచారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయలేదు రూ.750కోట్లు కేటాయిస్తామన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో రూ.60 లక్షల దళితులు ఉన్నారని, వారికి ప్రాథమిక సౌకర్యాలు ఇంతవరకు కల్పించలేరు. విద్యా వైద్యం సదుపాయాలు లేవు దళితులకు బడ్జెట్లో కేటాయింపులు లేవు, 18శాతం జనాభా శాతం ఎటువంటి బడ్జెట్లో అవకాశం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

మాదిగల ఆకాంక్షను నెరవేర్చిన సీఎంకు ధన్యవాదాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాదిగల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్ మాదిగ ధన్యవాదాలు తెలిపారు. గురువారం మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును దేశంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల కంటే ముందే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో స్వాగతిస్తూ ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎస్సీ వర్గీకరణ అమలు చేపడుతామని చెప్పారన్నారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రివర్గ ఉప సంఘం, జస్టిస్ షమీం అక్తర్ కమిషన్ ఏర్పాటుచేసి రెండున్నర నెలల్లో కమిషన్ పూర్తి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. దాని ఆధారంగా ఏబిసిగా వర్గీకరించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి మాదిగలు రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ గౌరవ అధ్యక్షులు రాజ్ గగన్ మాదిగ, అధికార ప్రతినిధి మల్లాని శివ మాదిగ, లింగం మాదిగ, గంగాధర్, గాయక్వాడ్ మాదిగ, సాయి మాదిగ, శంకర్ మాదిగ, కేశవ్ మాదిగ, గణేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్
- ఏఆర్ హెడ్ క్వార్టర్ తనిఖీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం రాత్రి నిజామాబాదులోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని డాగ్ స్క్వాడ్, ఎంటి సెక్షన్, లైబ్రరీ, బెల్ల ఫాం, స్పెషల్ పార్టీ, బీ.డీటీం, జిమ్ రూమ్‌లను, తదితర విభాగలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ తిరుపతి (అడ్మిన్/ఏంటీవో), శ్రీనివాస్ (వెల్ఫేర్), సతీష్ (హెూమ్ గార్డ్స్), శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి కంటి అద్దాలు, వాటర్ బాటిల్స్ ప్రధానం..

జిల్లాలో ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీదినం మండుటెండలో ఎండ తీవ్రతను తట్టుకొని విధులు నిర్వహిస్తూనారన్నా ఉద్దేశ్యంతో వారి కంటికి చలువ దనమును ఇచ్చే కంటి అద్దాలను, కూలీంగ్ స్టోరేజీ వాటర్ బాటిల్స్‌ను రవీంద్ర ఫార్మసి మెడికల్ ఏజన్సీ వారి సౌజన్యంతో పోలీస్ క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపియస్ చేతుల మీదుగా సిబ్బందికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతినీలోహిత కిరణాల వల్ల జబ్బులు వచ్చి అనారోగ్యానికి గురవుతున్న సందర్భంగా కంటి అద్దాలను సిబ్బంది తప్పక దరించాలని తెలిపారు. మంచినీటి బాటిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. కార్యాక్రమంలో ట్రాఫిక్ ఎసిపి నారాయణ, ట్రాఫిక్ సిఐ ప్రసాద్, రవీంద్ర ఫార్మసి అధ్యక్షులు మధు సుధన్, జనరల్ సెక్రటరీ సుధాకర్, ట్రేజరర్ సాయిలు, ట్రాఫిక్ ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీపీ..

నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కచ్చియా మసీదులో సీపీ పి.సాయి చైతన్య బుధవారం రాత్రి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో పోలీస్ కమిషనర్‌తో పాటు ఏసీపి రాజ వెంకట్ రామ్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్‌హెచ్ రఘుపతి, మత పెద్దలు యూనిస్ సాబ్, యాసీన్ సాబ్, సిద్దిక్ సాబ్, ఇస్మాయిల్ సాబ్, ఇద్రీస్ బాయ్, షకీల్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన జగిత్యాల జిల్లా ఎస్పీ...



ఏఆర్ హెడ్‌క్వాటర్ తనిఖీ చేస్తున్న సీపీ



జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ పి.సాయి చైతన్యను జగిత్యాల జిల్లా అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాని అందజేశారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ...

నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసిన పుష్పగుచ్ఛం అందజేశారు.

బిచ్కుంద తహసీల్దార్‌గా వేణుగోపాల్

నవతెలంగాణ-బిచ్కుంద



బిచ్కుంద తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సురేష్ రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ తహసీల్ కార్యాలయంలో ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలందిస్తానని ప్రజలకు రెవెన్యూ పరమైన సమస్యలు ఏవైనా ఉన్న తనకు నేరుగా కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

లింగంపేట డిప్యూటీ తహసీల్దార్‌గా రాందాస్

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్ డిప్యూటీ తహసీల్దార్‌గా గురువారం రాందాస్ బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పని చేసిన సంగమేశ్వర్ బదిలీపై బాన్సువాడ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ఆఫీస్ లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసినటువంటి రాందాస్ బదిలీపై లింగంపేట్‌కు వచ్చారు.

జుక్కల్ తహసీల్దార్‌గా మహేందర్ కుమార్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సిబ్బంది

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ నూతన తహసీల్దారుగా మహేందర్ కుమార్ గురువారం బాధ్యతలుస్వీకరించారు. గతంలో అధికారులకు సహకరించిన విధంగానే ప్రజలందరూ సహకరించాలని ఏవైనా పనులు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి నన్ను కలవచ్చునని సమస్యలను విన్నవించుకుంటే తన పరిధిలో ఉన్నంతవరకు ప్రజలకు అంకిత భావంతో సేవ చేస్తానని తెలిపారు. ఆయనకు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ హేమలత, ఆర్ఐ రామ్ పటేల్, సిబ్బంది నాగనాథ్ కలిసి సన్మానించారు.

రాజంపేట్ ఎమ్మార్వోగా సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-రాజంపేట్



రాజంపేట్ మండల ఎమ్మార్వోగా సతీష్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గాంధారిలో పనిచేసిన ఆయన,, రాజంపేట్‌కు బదిలీ అయ్యారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలన్నీ దళారులను ఆశ్రయించవద్దని, నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం రెవిన్యూ అధికారులు పూల గుచ్చం అందజేశారు.

గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా మేకల రాజు

నవతెలంగాణ-తాడ్వాయి

గ్రామాభివృద్ధి అధ్యక్షులుగా మేకల రాజు రెండోసారి ఎన్నికైనట్టు సభ్యులు తెలిపారు. గురువారం జరిగిన ఎన్నికల్లో, మేకల రాజు, చాకలి ఎర్రవటి రాజులు పోటీ పడగా అధ్యక్షులుగా మేకల రాజు గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా దమ్మనగారి రాములు, కృష్ణమూర్తి, లాలమ్మ నరేష్, కోశాధికారిగా ఏ.రాజు, కార్యదర్శిగా కీసరి రంజిత్ ప్రధాన కార్యదర్శిగా దాస సత్యం, సలహాదారులుగా గాండ్ల సంజు, మెట్టు బాలరాజ్, అజ్మత్, ముధం యాదగిరి ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం పనులు ప్రారంభమైనట్లు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. తహసిల్ ఎంపీడీవో కార్యాలయాల మధ్యలో మార్క్‌ౌట్ చేశామని నిర్మాణం పనులు గురువారం చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతతో కూడిన నిర్మాణం పనులు 30 రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనుమాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగించుకోవాలి

- నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వినోద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం యువకులకు నిరుద్యోగుల కోసం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ పథకాన్ని సీఎం ప్రతిష్టాత్మకంగా పథకం ప్రారంభించారాని తెలిపారు. ఈ రాష్ట్రంలో ఐదు లక్షల మందికి రూ.6కోట్ల రాయితీ రుణాలు, ఒక్కొ లబ్ధిదారుడికి రూ.4లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నారని తెలిపారు. 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో రుణాలు మంజూరు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగి సనవల రాజు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు సైకిల్ టెక్ అక్బర్, నాయకులు పాల్గొన్నారు.

గంగుల నర్సయ్య ప్రథమ వర్ధంతి



నవతెలంగాణ-మోపాల్

జిల్లా కేంద్ర శివారులోగల మాధవనగర్‌లో గంగుల నర్సన్న కాలనీలో కామ్రేడ్ నరసన్న స్తూపాన్ని ఏఐకేఎంకేఎస్ జాతీయ నాయకులు కామ్రేడ్ ప్రసాద్ చేతుల మీదగా గురువారం ప్రారంభించారు. దాని అనంతరం అక్కడినుంచి కాలనీ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి కార్మికులు, రైతులు, మహిళలు, ప్రజలు నర్సన్నకు జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. ఎర్రజెండా నీడలోనే ప్రజాపోరాటాలు చేస్తే న్యాయం జరుగుతుందన్నారు. కాలనీవాసులు పోరాటం చేస్తేనే ఇండ్ల పట్టాలు వస్తాయని, న్యాయం జరుగుతుందని, పట్టాలు వచ్చేంతవరకు నిరంతరం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కలసికట్టుగా ఉద్యమాల్లో పాల్గొనాలన్నారు. ప్రజాపోరాటంలో కూలీలు, పేదలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు పాల్గొని హక్కులు సాధించుకున్న రోజే, అమరవీరులకు నిజమైన నివాళ్లు అర్పించినట్టని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పల్ల మల్లేష్, జిల్లా కార్యదర్శి కత్తుల మారుతి, నరసయ్య, రాజిరెడ్డి, అనుష, రజియా బేగం, సంగీత, నరసింహులు, శంకర్, పల్లె బాలవ్వ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేంపల్లి చెరువులో మొసలి ప్రత్యక్షం

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలోని ఊర చెరువులో గురువారం రోజు మొసలి ఆనవాళ్ళను గుర్తించిన స్థానికులు గ్రామంలో ప్రచారం చేశారు. దీంతో గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని గమనించగా అది మొసలి అని నిర్ధారణ కావడంతో అధికారులకు సమాచారాన్ని అందించారు. అధికారులు మొసలిని పట్టే పనిలో నిమగ్నమయ్యారు.

అర్హులైన వారికే జీజీహెచ్ డైట్ టెండర్ ఇవ్వాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులైన వారికే జీజీహెచ్ డైట్ టెండర్ ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) డిమాండ్ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) డైట్ టెండర్‌పై అధికారుల వైఖరిని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు భోజనాన్ని అందించే డైట్ టెండర్‌పై గత కొద్దిరోజులుగా వార్తాపత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. పాత టెండరుదారుడిపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇదివరకు కొనసాగిన ప్రభుత్వ ఆసుపత్రి డైట్ టెండరుదారుడు నాసిరకం భోజనం పెట్టాడని, నిధులను స్వాహా చేశాడని ఆరోపణలు ఉన్నాయన్నారు. అయినా ఎలాంటి విచారణ, నిధుల రికవరీ జరగలేదన్నారు. మళ్లీ పాత టెండర్ దారుడికే అప్పగించాలనుకోవడంలో అధికారుల వైఖరిపై ఉన్నతాధికారులు స్పష్టత నివ్వాలన్నారు. పేషంట్లకు నాసిరకం భోజనం పెట్టడం, తప్పుడు రికార్డులతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరగడం, ప్రభుత్వ ఆసుపత్రిలో రివాజుగా మారిందన్నారు. అవినీతి ఆరోపణలు లేని, అర్హులైన వారికే టెండర్ దక్కేలా చూడాలని, రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు కే.సంధ్యారాణి, కే.గణేష్, టి.విటల్, అమూల్య, లలిత, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మాదిగల పోరాటానికి ముగింపు పలికిన ఎస్సీ వర్గీరణ బిల్లుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం తెలిపేందుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకి కాంగ్రెస్ ప్రభుత్వానికి మాదిగ జాతి రుణపడి ఉంటుందని తెలిపారు. మండలంలోని కేశపల్లి గ్రామ మాదిగ సంఘ సభ్యులు సీఎం చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మున్నూరు ప్రణయ్, గ్రామ శాఖ యూత్ అధ్యక్షులు కడుదురం శేఖర్, గ్రామ అభివృద్ధి కమిటీ చేర్మెన్ గంగశ్రీను, సర్వ సమాజ్ సంఘ చెర్మన్ దేవేష్, మాజీసర్పంచులు కడుదురం లక్ష్మణ్, చిన్న రామగౌడ్, మాజీ ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్, మాదిగ సంఘ అధ్యక్షులు చిన్న గంగారాం, మాదిగ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు బిల్లుల ఆమోదం.. చారిత్రాత్మకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

బీసీలకు విద్యా ఉద్యోగ, రాజకీయ అంశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన బిల్లును శాసన సభలో ఏకగ్రీవంగా ఆమోదించడంతో గురువారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరే స్వామి ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శాసనసభలో(బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్‌లు, బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్‌లు, మాదిగ ఉపకులాల వర్గీకరణ) చారిత్రాత్మక బిల్లులు ఆమోదం పొందాయని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జేజే నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్,బీసీ అధ్యక్షులు కొరడి రాజు,మహిళా అధ్యక్షురాలు కల్పన,జిల్లా యువజన ఉపాధ్యక్షులు నాగేంద్ర, చరణ్ గౌడ్,మల్లెల లక్ష్మణ్, వాకా మహేష్, సుంకరి సురేష్, పల్లె శేఖర్, మూడేడ్ల అశోక్, దొనకంటి రాజేష్, సాయిబాబా, చిన్నారెడ్డి, మహేష్,చింటూ, నవీన్, శ్రీను, కిషన్,శివ, నారాయణ, బొర్రన్న, కొరాడి లింబాద్రి, కిరణ్, రవి, జమ్ము, సంతోష్, అశోక్, సేవాలాల్, మల్లేష్, గంగాధర్, కుర్రాన్న, ముత్తన్న, మైపాల్, భాస్కర్, రాజన్న, భూషణ్, శంకర్, కృష్ణ, నాగేష్, రాజారెడ్డి, పృథ్వీరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఇసుక రవాణ టిప్పర్లకు జరిమాన

నవతెలంగాణ-బోధన్

పరిమితికి మించి, అధిక లోడ్‌తో ఇసుక అక్రమ రవాణాశాఖ చేస్తున్న టిప్పర్లకు గురువారం అధికారులు పట్టుకుని జరిమాన విధించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, స్పెషల్ స్క్వాడ్ ఇన్స్ పిక్టర్ శ్రీకాంత్, ఎంపీఐ శ్రీనివాస్, రెవెన్యూ పోలీస్ అధికారుల తనిఖీలో 5 టిప్పర్లు ఇసక అధిక లోడ్‌తో తరలిస్తూ పట్టుబడడంతో వాటిని పట్టుకుని రూ.2లక్షల జరిమాన విధించారు. అనంతరం ఇసుక వాహనాలను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని రహత్‌నగర్ గ్రామానికి చెందిన సిరికొండ జలంధర్ అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. జలంధర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారిది పేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ వారి కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాహత్ నగర్ ఇన్చార్జ్ సేవాలాల్ చెరుకు రాజు, సిరికొండ వెంకటేష్ మూడు రాజేందర్, భూక్య రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్ తై బజార్ వేలం వాయిదా

- జిపి కార్యదర్శి సందీప్ కుమార్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ తైబజార్ వేలంపాట ఈనెల 20న గురువారం జరగవలసి ఉండగా అనివార్య కారణాల వలన వాయిదా వేయవలసి వచ్చిందని పంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్ తెలిపారు. వాయిదా పడ్డ తైబజార్ వేలం పాట నిర్వహించడానికి మళ్లీ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఏవి..?

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో కేటాయిస్తామన్న రూ.20వేల కోట్లు ఏవని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ ప్రశ్నించారు. ఐదు సంవత్సరాల్లో బిసి కులాల ప్రజలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్‌లో కేటాయించి బిసి కులాల ఆర్థిక, రాజకీయ సామాజిక సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ప్రకటించిందన్నారు. గత బడ్జెట్‌లో 9 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టు పేపర్‌పై ప్రకటించినా బిసి కులాల కార్పొరేషన్ లకు నయా పైసా విడుదల చేయలేదని విమర్శించారు. బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 11 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రకటించిన ఆచరణలో శూన్యమేనని తెలిపారు. విద్య ,ఉపాధి, వైద్య అభివృద్ధి కోసం తగిన విధంగా నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.